క్లుప్తంగా

శిథిలావస్థలో ట్యాంకు



బాన్సువాడ : మున్సిపాలిటీ పరిధిలోని సంగమేశ్వర చౌరస్తా వద్ద ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. మంజీర నుంచి వచ్చే నీరు ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి చేసి ఈ ట్యాంకు సరఫరా చేస్తారు. గతంలో పాత బాన్సువాడకు ఈ ట్యాంకు నుంచే నీటి సరఫరా చేసే వారు. 2 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ ట్యాంకు ప్రస్తుతం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు స్పందించి ట్యాంకు కూల్చివేసి అమృత్ 2.0 పథకం కింద కొత్త ట్యాంకును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సిద్ధరామేశ్వరాలయం పూజా సామగ్రి దుకాణం వేలం

భిక్కనూరు: మండలంలోని సిద్ధరామేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలోని పూజా సామగ్రి దుకాణం నిర్వహణకు మంగళవారం వేలం వేసినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కే.మహేశ్వరి ఏడాదికి గాను రూ.5.71 లక్షలు పాడి దక్కించుకుందని ఆయన పేర్కొన్నారు. ఈవేలం రెండు సంవత్సరాల వరకు ఇదే పాటగా ఉంటుందని ఈవో చెప్పారు.

రోడ్డుపైనే ధాన్యం ఆరబోత



నిజాంసాగర్(జుక్కల్): ఓ వైపు రోడ్డు విస్తరణ పనులు...మరో వైపు రోడ్డుపైన ధాన్యం కుప్పలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాన్సువాడ- ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ధాన్యం ఆరబెట్టడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్, తుంకిపల్లి, తుంకిపల్లి తాండ, కొన, నడిమి, గిర్నితాండ ప్రాంతాల్లోని ప్రధాన రహదారిపైన వరిధాన్యాన్ని రైతులు ఆరబెట్టారు. ధాన్యం ఆరబెట్టడంతో పాటు పక్కన బండరాళ్లు, కర్రలను అడ్డుగా పెట్టారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎల్లారెడ్డిలో అందని ఆర్టీసీ కార్గో సేవలు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో ఆర్టీసీ కార్గో సేవలు నిలిచి పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి నుంచి ఇతర ప్రాంతాలకు ఆర్టీసీ కార్గో ద్వారా పార్శిల్‌ను పంపేందుకు వెళ్లడంతో మిషన్ పని చేయడం లేదని సిబ్బంది సూచిస్తున్నారన్నారు. ఈవిషయమై సిబ్బందిని అడగగా బుకింగ్ సర్వీసుకు సంబంధించిన మిషన్ పాడైపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని మిషన్ రాగానే సర్వీసులు అందిస్తామన్నారు.

నిరుపయోగంగా మూత్రశాలలు



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో మూత్రశాలలు నిరుపయోగంగా మారాయి. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మూడేళ్ల క్రితం బస్‌షెల్టర్‌ను కూల్చివేసి అదే స్థలంలో మూత్రశాలలను నిర్మించి వదిలేశారు. ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి.

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మూడు జిల్లాల చౌరస్తా అయిన గజ్యానాయక్ తండా చౌరస్తాకు రాజన్న-సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల నుంచి ప్రయాణికులు వచ్చి పోతుంటారు. మూత్ర శాలలు ఉండి ప్రారంభించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే మూత్రశాలలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ఎల్లారెడ్డిరూరల్: ఉపాధిహామీ పనులకు కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో ప్రకాశ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో మాట్లాడుతు ప్రతి గ్రామంలో 50 శాతానికి పైగా ఉపాధిహామీ పనులకు కూలీలు హాజరయ్యేలా చర్యలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వినోద్, టీఏలు తదితరులున్నారు.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

బాన్సువాడ రూరల్: నిజామాబాద్ జిల్లా సాలూర మండలం తగ్గెల్లి శివారులో జరిగిన ఈతవనం అగ్నిప్రమాదంలో నష్టపోయిన కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సర్దార్ సర్వాయి పాపన్న మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు పోచారం నరేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఐదు ఎకరాల్లో సుమారు 5వేల ఈత మొక్కలు అగ్నికి ఆహుతి కావడంతో గౌడకుటుంబాలు నష్టపోయాయన్నారు.

జోరుగా నల్లమట్టి దందా

- జుక్కల్ మండలం లాడేగావ్ చెరువులో అక్రమ తవ్వకాలు
- ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలింపు
- పట్టించుకోని అధికారులు





లాడేగావ్ చెరువులో మట్టిని తీస్తూ టిప్పర్లు, ట్రాక్టర్లలో నింపుతున్న పొక్లెయిన్లు

నిజాంసాగర్(జుక్కల్): జిల్లా కేంద్రానికి సరిహద్దున గల జుక్కల్ మండలంలోని చెరువుల్లో నల్లమట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రైతుల ముసుగులో తవ్వకాలు చేపడుతూ పొరుగు రాష్ట్రాలకు నల్లమట్టి రవాణా చేస్తున్నారు. జుక్కల్ మండలంలోని లాడేగావ్ చెరువులో గత వారం రోజుల నుంచి మట్టి తవ్వకాలు జోరందుకున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతూ నల్లమట్టిని కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇటుక బట్టీలకు నల్లమట్టి ఉపయోగకరంగా ఉండటంతో పాటు పంట పొలాలకు ఎరువుగా మట్టిని ఉపయోగిస్తారు. ట్రాక్టర్ మట్టి ట్రిప్పుకు రూ. 2,500 చొప్పున, టిప్పర్ మట్టికి రూ. 6 నుంచి రూ. 10 వేల వరకు డిమాండ్ ఉంది. మార్కెట్‌లో నల్లమట్టికి డిమాండ్ అధికంగా ఉండటంతో చెరువులో మట్టి తవ్వకాల వ్యాపారం ఊపందుకుంది. రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులను రాజకీయ నాయకులు తమ గుప్పిట్లో పెట్టుకొని నల్లమట్టి దందా చేపడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులో మట్టి తవ్వకం ద్వారా గుంతలు, ఏర్పడుతాయి. ఈగుంతలతో మున్ముందు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

> **ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకోవాలి**
>
> లాడేగావ్ చెరువులో మట్టితవ్వకాలపై సమాచారం తెలువదు. ఇరిగేషన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.
>
> – రామారావు, ఆర్ఐ, జుక్కల్

తొలగిన ట్రాఫిక్ ఇబ్బందులు..



ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉన్న రోడ్డు

ఎల్లారెడ్డిరూరల్ : పట్టణంలోని గాంధీచౌక్ ప్రాంతంలో రోడ్డుపై కూరగాల విక్రయాలు అనే శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి మంగళవారం మున్సిపల్ అధికారులు స్పందించారు. రోడ్డుకు ఇరువైపుల కూరగాయలు, పండ్లు విక్రయించకుండా తగిన చర్యలు తీసుకుని కూరగాయలను రద్దీ లేని రోడ్డుపై విక్రయించుకోవాలని సూచించారు. దీంతో విక్రయదారులు రద్దీలేని ప్రాంతంలో కూరగాయలను విక్రయించుకోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తొలగిపోయాయి.

సాక్షి ఎఫెక్ట్..

హద్దులు తొలగించారు..

- కబ్జాదారులపై చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం



తొలగించిన హద్దుల తర్వాత నిజాంసాగర్ ఉప కాలువ

బాన్సువాడ : నిజాంసాగర్ ఉప కాలువ పక్కన పాతిన హద్దులను కబ్జాదారులు తొలగించారు. ఈ నెల 28న 'కబ్జాకు గురవుతున్న నిజాంసాగర్ ఉప కాలువ' అనే శీర్షికన వచ్చిన కథనానికి ఇరిగేషన్ డీఈ జగదీష్ స్పందించి అక్రమార్కులచే కాలువ పక్కన పాతిన హద్దులను తొలగింపజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని బీడీ వర్కర్స్ కాలనీకి వెళ్లే దారిలో ఓ ప్రైవేటు భూమిలో వెంచర్ నిర్మించారు. ఈ వెంచర్ పక్కనే నిజాంసాగర్ డీ-10 ఉప కాలువ ఉంది. ఉప కాలువకు ఇరువైపుల సీసీ వాల్ నిర్మించి, ఓ రియల్టర్ కాలువకు ఇరువైపుల 9 ఫీట్ల మేరకు కట్టను తొలగించి ప్లాట్లు చేసి హద్దులు పాతాడు.ఈవిషయంపై కథనం రాగానే హద్దులు తీసేసి చేతులు దులుపుకున్నారు. కబ్జాదారులపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చోరీకి గురైన సెల్‌ఫోన్ అప్పగింత



బాన్సువాడ : చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను మంగళవారం సీఐ అశోక్ అప్పగించారు. పట్టణానికి చెందిన గొడుగు అపర్ణ అనే మహిళ ఈ నెల 3న బస్సులో వర్నికి వెళ్తుండగా సెల్‌ఫోన్ చోరీకి గురైంది. అపర్ణ వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫోన్ ఐఎంఈ నంబర్ ఆధారంగా చోరీకి గురైన ఫోన్‌ను రికవరి చేసి ఫిర్యాదుదారుకు అప్పగించారు.

గుడాడి రెడ్డి సంఘం నూతన కార్యవర్గం



భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామ గుడాడిరెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిట్టడి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నల్లగొండ సాయిరెడ్డి, కోశాధికారిగా కుంట అమృత్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా చిటడి మధుమోహన్‌రెడ్డి, కుంట భానుతేజ రెడ్డి, నల్లగొండ సురేందర్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ చిట్టడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు.

పునాది దశ దాటని ఇందిరమ్మ మోడల్ హౌస్



రాజంపేట: మండలానికి ఒక మోడల్ హౌజ్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంట్లో భాగంగా ఎంపీడీవో కార్యాలయ పరిధిలో గత నెల రోజుల క్రితం స్థలం కేటాయించింది. సుమారు 20 రోజుల క్రితం మోడల్ హౌస్ నిర్మాణానికి ముగ్గు వేసి గుంతలు తీశారు. ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణ పనులు మొదలుపెట్టలేదు. ఈ విషయంపై ఎంపీడీవో రఘురాంను వివరణ కోరగా హైదరాబాద్ హౌజింగ్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో షేర్ వాల్స్ (రెడీ మేడ్) గోడల ఆధారంగా త్వరలోనే ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



తాడ్వాయిలో మాట్లాడుతున్న డీపీవో మురళి



సమావేశంలో పాల్గొన్న గ్రామ కార్యదర్శులు

- డీపీవో మురళి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని డీపీవో మురళి అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు గ్రామాలలో పర్యటించి తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించాలన్నారు. మిషన్ భగీరథద్వారా వచ్చే నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, పైపులు లీకేజీ అయినట్లయితే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. పైపులు ధ్వంసమైతే వెంటనే కొత్తపైపులను ఏర్పాటు చేయాలని, గ్రామాలలో ఉండే బోరుల ద్వారా కూడా ట్యాంకులలోకి నీరు వచ్చేలా చూడాలన్నారు. మొబైల్ ట్యాంకుల ద్వారా ఇంటింటికి నీటిని సరఫరా చేయాలని సూచించారు. రక్షిత మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. తాగునీటిపై అధికారులు అశ్రద్ద వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, గ్రామ కార్యదర్శులు, కారోబార్లు పాల్గొన్నారు.

తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లుకు తరలించాలి



మాట్లాడుతున్న ఐకేపీ డీపీఎం రమేశ్ బాబు

రాజంపేట: కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేసిన ధాన్యం బస్తాలనే వెంటనే సంబంధిత రైస్‌మిల్లులకు తరలించాలని ఐకేపీ డీపీఎం రమేశ్ బాబు అన్నారు. మంగళవారం రాజంపేట మండల ఆరెపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం మాయిశ్చర్, రైతు సమోదు రిజిస్టర్‌ల గురించి ఐకేపీ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెనువెంటనే రైసు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సీసీ రమేశ్, వీవోఏ సిద్దేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



సుల్తాన్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్



రాముల గుట్టతండాలో పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి దయానంద్

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. ఇందిరమ్మ పథకం కింద గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి రవిరాథోడ్ తదితరులున్నారు.

నిబంధనలకు లోబడి ఇంటి నిర్మాణాలు చేయాలి

నస్రుల్లాబాద్: ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇంటి నిర్మాణాలు చేయాలని మండల ప్రత్యేక అధికారి ఈడీ దయానంద్ అన్నారు.మండలంలోని రాముల గుట్ట తండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. నాణ్యతగా పనుల చేసుకోవాలని, విడుతల వారిగా బిల్లులు వస్తాయన్నారు. అలాగే మైలారం గ్రామంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. వర్షాకాలం వరకు మొక్కలను సిద్ధం చేయాలన్నారు. వేసవిలో మొక్కలు వాడిపోకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సూర్యకాంత్, సిబ్బంది ఉన్నారు.

పరిసరాలు ఇలా.. వ్యాధులు రావద్దంటే ఎలా



బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని సంగ్రాం తండాలో నీటితొట్టి వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. నీటితొట్టి చుట్టూ మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే మురుగునీరు రోడ్డుపై నుంచి పారుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని తండావాసులు వాపోతున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో దోమలు వృద్ధి తండావాసులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటితొట్టి చుట్టూ సీసీ చేయించి, మురికినీరు నిల్వలేకుండా చేయాలని తండావాసులు కోరుతున్నారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక పాఠాలు



గాంధారి(ఎల్లారెడ్డి): ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పాఠాలు బోధిస్తున్నామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గఢ్డం గంగారాం మంగళవారం తెలిపారు. సెలవుల్లోను ఫెయిల్ సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు పాఠాలు బోధిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేస్తూ వచ్చే నెలలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయాలి

- డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్
- డీటీఎఫ్ జిల్లా వార్షిక సమావేశం



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్

కామారెడ్డి అర్బన్: జనాభాకు అనుగుణంగా రాష్ట్రంలో కొత్తగా పాఠశాలలను ఏర్పాటు చేయాలని, విద్యా కమిషన్ సిఫార్సుల పేరిట పాఠశాలల కుదింపు ప్రయత్నాలు మానుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ అన్నారు. డీటీఎఫ్ కామారెడ్డి జిల్లా నాల్గోవ వార్షిక సమావేశం మంగళవారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌సీ ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించగా ప్రధాన కార్యదర్శి బి.దేవులా జిల్లా నివేదికను ప్రవేశపెట్టారు. రెండేళ్ల గడిచిన పీఆర్‌సీ ఉసేలేకపోయిందని, ఐదు డీఏలు పెండింగ్, విద్యారంగానికి అరకొర నిధులు, పర్యవేక్షణ అధికారుల ఖాళీలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు, సీపీఎస్ రద్దు, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై శంతన్‌తో పాటు ఇతర నాయకులు మాట్లాడారు. సమావేశంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు బాబురావు, సునంద, రాజేందర్, జిల్లా ప్రతినిధులు బాలయ్య, సాయిలు, శ్రీవాణి, రాములు, సరోజిని, చిన్నస్వామి, శ్రీకాంత్, శ్యాం అరవింద్, విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నర్సరీని మంగళవారం మండల ప్రత్యేక అధికారి రాజారాం పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు మొక్కలకు నీటిని పోసి మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. నర్సరీలో అన్నిరకాల మొక్కలను పెంచాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఏపీవో కృష్ణగౌడ్, నర్సరీ నిర్వాహకులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో మంగళవారం బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ పంపిణీ చేశారు. మండలంలోని మల్లూర్, అచ్చంపేట, వెల్గనూర్, సుల్తాన్ నగర్ గ్రామాలకు చెందిన బాధితులు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వచ్చిన చెక్కులను గ్రామాల వారీగా బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సన్నబియ్యం సరఫరాతో నిరుపేదల్లో సంతోషం



బస్వాపూర్‌లో మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి

భిక్కనూరు: సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకంతో నిరుపేదల్లో సంతోషం వెల్లివిరిసిందని పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలో ఓ లబ్ధిదారు ఇంట్లో సన్నబియ్యం భోజనం చేశారు. బీఆర్ఎస్ బీజేపీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడం, మినహ ఎలాంటి అభివృద్ధి పనులకు సహకరించడం లేదన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, నేతలు స్వామి,తుడుం జీవన్, కిరన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

4 నుంచి బాల సంస్కార శిబిరం ఏర్పాటు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి శ్రీ కృష్ణ మందిరంలో మే-4 నుంచి 12వ తేదీ వరకు బాల సంస్కార శిబిరం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి మచాలే బాబా తెలిపారు. ఈ శిబిరంలో భగవద్గీత, దేశభక్తి, దైవభక్తి, ధర్మరక్షణకు సంబంధించిన అంశాలను పిల్లలకు నేర్పించడం జరుగుతుందన్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. శిబిరంలో చేరడానికి ఒక్కో విద్యార్థికి రూ.650 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

తాడ్వాయి/రాజంపేట : తాడ్వాయి, రాజంపేట రైతు వేదిక కార్యాలయాల్లో బుధవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్లు రహీమొద్దీన్, సతీష్‌రెడ్డి తెలిపారు.అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు భారీసంఖ్యలో తరలి వచ్చి ఈ అవగాహన సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు.

రేపు చండీ మంత్రాలయ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: స్థానిక ప్రియానందాశ్రమం చండీ మంత్రాలయం 21వ వార్షికోత్సవాలు మే 1, 2, 3 వతేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రియానంద పరివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు శ్రీచక్రార్చనలు, హవనం, కుంకుమార్చనలు, మహానైవేద్యం, హారతి, మహాజన భోనాలు, సాయంత్రం సత్సంగం, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని పేర్కొంది.

జూన్ 24 నుంచి సనాతన వేద యజ్ఞ రథయాత్ర

కామారెడ్డి అర్బన్: సత్య సనాతన వైదిక ధర్మ పూర్వ వైభవం కోసం జూన్ 24 నుంచి దేశవ్యాప్తంగా సనాతన వేదయజ్ఞ మహారథ యాత్ర ప్రారంభించనున్నట్లు వేదగిరి సంస్థాపక చార్య, రథయాత్ర సంకల్పకర్త మర్రి కృష్ణారెడ్డి ఆర్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యసమాజం స్థాపకులు స్వామి దయానంద సరస్వతి 1875లో ముంబాయిలోని కాకరవాడిలో తొలి ఆర్యసమాజం ప్రారంభించినందున అక్కడి నుంచి జూన్ 24న వేద మహారథయాత్ర ప్రారంభమై దేశంలోని వివిధ రాష్ట్రాల గుండా అక్టోబర్ 9న ఢిల్లీలో అంతర్జాతీయ ఆర్య మహా సమ్మేళనంతో ముగుస్తుందన్నారు.

నేడు వక్ఫ్‌చట్టానికి నిరసనగా లైట్స్‌ఆఫ్

బాన్సువాడ రూరల్: కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌చట్టానికి నిరసనగా బుధవారం రాత్రి 9గంటల నుంచి 15నిమిషాలపాటు లైట్స్‌ఆఫ్ చేసి నిరసన తెలుపాలని బాన్సువాడ తన్‌జీముల్ మజీద్ కమిటీ అధ్యక్షులు ఇంతియాజ్ అహ్మద్ కోరారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు మండల ప్రతినిధి ముఫ్తీ ఉమర్ బిన్ ఈసాతో కలిసి ఆయన మాట్లాడారు. ఉగ్రవాదాన్ని కేంద్ర ప్రభుత్వం కూకటివేళ్లతో పెకిలించి వేయాలని వారు డిమాండ్ చేశారు.

లింగంపేట్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం లింగంపేట్ మండలానికి తరలివెళ్లారు. లింగంపేట్ మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు తరలి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నాయకులు షౌకత్‌అలీ, మహేందర్‌రెడ్డి, శ్యాంరావు, సుధాకర్‌రావు, మేకల రాజు, సంజీవులు, అఖిల్‌రావు, నరేందర్‌రెడ్డి, లక్ష్మన్, శివాజీ, రాజీవ్‌కుమార్ తదితరులున్నారు.